
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 10 అక్టోబరు 2024



రేషన్.. డాన్

- మాఫియాలో గుత్తాధిపత్యం
- గుంటూరుకు చెందిన ఓ మిల్లర్‌తో కుమ్మక్కు
- ఎదురు తిరిగిన వారిపై అధికారులతో దాడులు.. కేసులు
- గతంలో వైసీపీతో.. ప్రస్తుతం కూటమి నేతలతో సంబంధాలు

పేదల బియ్యం బొక్కే రేషన్ మాఫియాలో ఓ డాన్ అవతరించాడు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ నేతలతో అంటకాగి.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తన అక్రమాలకు అడ్డులేకుండా చేసుకునేందుకు గోడ దూకాడు. ఈ క్రమంలో సొంత సామాజికవర్గం పేరుతో జనసేన నేతలతో.. మరో సామాజిక వర్గం అండతో టీడీపీ నేతలతోనూ సంబంధాలు కొనసాగిస్తున్నాడు. రేషన్ మాఫియాను తన చెప్పుచేతుల్లో ఉంచుకునేందుకు కూటమి నేతలు, అధికారులను వినియోగించుకుంటున్నాడని సమాచారం. తన గుత్తాధిపత్యానికి చెక్ చెప్పే వారిని టార్గెట్ చేసి వారిపై అధికారులతో దాడులు చేయించి.. కేసులు పెట్టిస్తున్నాడు. ఈ క్రమంలోనే రెండు రోజులుగా గుంటూరు పరిసరాల్లో వరుస గా రేషన్ బియ్యం పట్టుబడిందని సమాచారం. తనకు అడ్డు వస్తున్నాడని సొంత బావపైనే ఏకంగా దాడి చేసి తిరిగి అతడిపైనే కేసు పెట్టించి ఇతరులకు హెచ్చరికలు పంపాడు. తనకు తెలియకుండా రేషన్ బియ్యం కొన్నా, తనకు తెలియకుండా అమ్మినా వారి అంతు తేల్చడమే పనిగా ఈ డాన్ పెట్టుకో గా అతడికి అధికారులు పూర్తిగా సహక రిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సాక్షాత్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి సొంత జిల్లా అయిన గుంటూరులో రేషన్ డాన్ ఇంతలా పెచ్చరిల్లిపోతున్నా అధికారులు నిమ్మకు నీ రెత్తినట్లు వ్యవ హరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- రెండు రోజుల క్రితం గుంటూరు పట్టాభిపురం పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. గుజ్జనగుండ్ల నుంచి పలకలూరు మీదగా కాకినాడ పోర్టుకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులు కేసు పెట్టి ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు.

- తాజాగా బుధవారం తెల్లవారుజామున రెండు భారీ వాహనాల్లో తరలిస్తున్న 28 టన్నుల రేషన్ బియ్యాన్ని చేబ్రోలులో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాలు వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి నుంచి గుజరాత్‌కు తరలిస్తుం డగా తనిఖీల్లో దొరికినట్లు పోలీసులు తెలిపారు.

బాపట్ల, గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడు రోజు ల్లో గుంటూరు పరిసరాల్లో ఈ ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ రెండు ఘటనల ద్వారా రేషన్ బియ్యం తరలింపును అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు అని అందరూ భావిస్తారు. అయితే ఇన్నాళ్లూ గుట్టుగా సాగిపోయిన ఈ వ్యవహారం రేషన్‌మాఫియాలో గ్రూపుల మధ్య కుమ్ములాటలతో వెలుగులోకి వచ్చింది. మొత్తం రేషన్ బియ్యం మాఫియాను తన గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్న 'డాన్' ఒకరు ఈ వ్యవహారాలు మొత్తం నడిపిస్తున్నారని సమాచారం. తనకు అడ్డుగా ఉన్నవారిపై సదరు డాన్ అధికారులకు సమాచారం ఇవ్వడం.. అప్పటికప్పుడు వారు తనిఖీలు చేపట్టడం.. కేసులు పెట్టడం జరిగిపోతోంది. అక్రమాలకు అడ్డు వచ్చిన వారిని తొలగించుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నాడు. తన గుత్తాధిపత్యానికి అడ్డువచ్చినవారు తనవారైనా.. పరాయివారైనా ఉపేక్షించేది లేదంటూ మాఫియా డాన్ హెచ్చరికలు చేస్తున్నాడు. తన మాట వినలేదన్న కసితో సదరు మాఫియా డాన్ సొంత బావను కూడా వదిలిపెట్టలేదు. అక్క భర్తన్న ఆలోచన కూడా లేకుండా తల పగలగొట్టాడు. తన పలుకుబడిని ఉపయోగించి గుంటూరు పట్టాభిపురంలో అక్రమంగా కేసు పెట్టి మిగిలిన వారికి తీవ్ర హెచ్చరికలు పంపాడు. గుంటూరులోని 201 రేషన్ షాపుల్లో 40కిపైగా షాపుల్లో ఈ డానే పెట్టుబడి పెడుతూ వాటిని తన అదుపాజ్ఞల్లో ఉంచుకుని రేషన్ మాఫియాను శాసిస్తున్నాడు. ఈ డాన్ గుంటూరు కాకాని రోడ్డులోని ఓ మిల్లర్‌తో కుమ్మక్కయ్యాడు. దాదాపు రెండు దశాబ్దాలుగా రేషన్ అక్రమాలకు పాల్పడుతున్న ఈ డాన్ మిల్లర్‌తో కలిసి రేషన్‌బియ్యంపై గుత్తాధిపత్యానికి తెరతీశాడు. గతంలో వైసీపీతో అంటకాగిన సదరు డాన్.. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే తన సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని జనసేనతో సంబంధాలు నెరుపుతున్నాడని సమాచారం. అదే పద్ధతిలో మరో ప్రధాన సామాజిక వర్గానికి చెందిన మిల్లర్‌తో కలిసి టీడీపీతో సంబంధాలు కొనసాగిస్తున్నా డు. సదరు మిల్లర్ ద్వారా ప్రాసెసింగ్ చేసి సన్నబియ్యంగా మార్చి ఎగుమతి చేస్తున్నాడు.

డాన్‌కు అధికారుల విధేయత

రేషన్ మాఫియా డాన్ పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, పోలీసు అధికారులతో సత్సంబంధాలు నెరుపుతూ తన వ్యవహారాలను చక్కబెట్టుకుం టున్నాడు. అధికారులకు కావాల్సిన కేసులు కూడా తనే సమాచారం ఇచ్చి సహకరిస్తుంటాడు. కానివారిపై కేసులు పెట్టి దారికి తెచ్చుకుంటున్నాడు. ఇలా రేషన్‌మాఫియా గుత్తాధి పత్యం భరించలేని కొందరు సొంత ప్రయత్నాలు చేసుకుం టున్న మరికొందరు అక్రమార్కులపై అధికార బలాన్ని ఉప యోగించి కేసులు పెట్టిస్తున్నాడు. డాన్‌కు వ్యతిరేకంగా ఉన్నా డన్న కారణంగా వట్టిచెరుకూరు మండలం చెవళ్లమూడిలోని ఓ మిల్లర్‌పై అధికారులు పదే పదే దాడులు చేస్తున్నారు. గత జూలైలో ఆ మిల్లుపై దాడి చేసి 750 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. తాజాగా బుధవారం మరో 28 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఇలా పట్టుకున్న బియ్యాన్ని సదర్ డాన్‌తో చేతులు కలిపిన కాకాని రోడ్డులోని మిల్లుకే తరలిస్తున్నారు. కాకాని రోడ్డులోని మిల్లర్‌పై ఇప్పటికే లెక్కకు మించిన కేసులు ఉన్నా పట్టుబడిన బియ్యాన్ని ఆ మిల్లుకే తరలించి పౌర సరఫరాల శాఖ అధికారులు తమ విధేయతను చాటుకుంటుండడం విశేషం.

పీడీ యాక్టే విరుగుడు

వైసీపీ ప్రభుత్వంలో నేతలు సహజవనరుల దోపిడీనే కాకుండా పేదోడి బియ్యం మీద కూడా మాఫియాను వ్యవస్థీకృతం చేసి కోట్లు ఆర్జించారు. వైసీపీ నేతలకు ముడుపులు ముట్టచెప్పి దర్జాగా బియ్యం దందా చేసేవారు. మొక్కుబడిగా 6ఏ కేసులు నమోదు చేయడం తప్ప వ్యవస్థీకృతంగా మారిన రేషన్ దందాకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోయారు. రేషన్ మాఫియాలోని కీలక వ్యక్తులపై పీడీ యాక్టు ప్రతిపాదనలను అధికారులు పంపినా రాజకీయ ఒత్తిళ్లతో వాటిని అప్పట్లో నీరుగార్చారు. వ్యవస్థీకృతంగా మారిన దందాను కట్టడి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. కానీ క్షేత్రస్థాయిలో ఈ దందా చాలా వరకు కూటమి పార్టీ ద్వితీయశ్రేణి నేతల కనుసన్నల్లోనే నడుస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతుంది. పైగా తనిఖీలకు వెళ్లిన అధికారులకు గత ప్రభుత్వంలో ఈ దందా జరగలేదా? ఇప్పుడు జరిగితే తప్పేంటన్న రీతిలో ప్రశ్నించడం బరితెగింపునకు నిదర్శ నంగా కనబడుతోంది. నెలన్నర క్రితం నిజాంపట్నం మండలపరిధిలో బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో అధికారులు తనిఖీలకు వెళ్లగా అక్కడ దందాను నడిపిస్తున్న వ్యక్తుల వద్ద నుంచి యంత్రాంగానికి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. అద్దంకి నియోజకవర్గ పరిధిలో అధికారుల వాహనాలకు తమ వాహనాలను అడ్డుగా పెట్టి మరీ రేషన్ మాఫియా బెదిరింపులకు దిగింది. గత ప్రభుత్వం అటకెక్కించిన పీడీయాక్టు కేసు ప్రతిపాదనలను అమలు చేయడమే ఈ దందాకు విరుగుడుగా కనబడుతోంది. పదేపదే ఈ దందాలో పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్టు చట్టం కింద కేసు నమోదు చేసి కఠినచర్యలుంటాయనే సంకేతాలను సదరు మాఫియాకు పంపగలిగితేనే కూటమి ప్రభుత్వంలోనైనా రేషన్ దందాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. లేదంటే ప్రభుత్వం మారినా మూడు పువ్వులు ఆరు కాయలుగా ఈ మాఫియా వర్ధిల్లుతూనే ఉంటుంది. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఈ రెండు నెలల్లో రేషన్ అక్రమార్కులపై 42 వరకు 6 ఏ కేసులు నమోదు కాగా 780 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం కేసులునమోదైన వారిలో గత ప్రభుత్వంలో 6ఏ కేసులు నమోదై ఉన్న వారు కూడా ఉండడం గమనార్హం.

భయానకంగా పరిస్థితులు

రేషన్‌మాఫియా మధ్య గొడవలు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఒకరిపై ఒకరు దాడులుచేసుకునే స్థాయిని దాటి పోలీస్ స్టేషన్ల వరకు వెళ్తున్నాయి. గతంలో పొన్నూరు చెందిన రేషన్ మాఫియా లీడర్ 'బర్నబాస్' హత్యోదంతం జరిగిన అనుభవాలున్నా అధికారుల్లో చలనం లేదు. గతంలో 2022 చివర్లో ఇదే మాఫియా డాన్ పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఓ రిపోర్టరుపై దాడి చేయించి తల పగలగొట్టిన ఘటన కూడా ప్రజలు ఇంకా మర్చిపోలేదు. కానీ మాఫియా తగాదాలు ఆందోళనకర స్థాయిలో జరుగుతున్నా యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం.

గతంలో రాజకీయ ఒత్తిళ్లు

వైసీపీ హయాంలో చివరి రెండేళ్లలోనే బాపట్ల జిల్లాలో దాదాపుగా 250 వరకు 6ఏ కేసులను అధికారులు నమోదు చేశారు. మూడు సార్లుకు మించి 6ఏ కేసులు పెడితే వారిపై పీడీయాక్టు ప్రతిపాదనలను అప్పటి అధికారులు చేశారు. రేషన్ మాఫియాలో కీలకంగా వ్యవహరించే చీరాలకు చెందిన ఓ వ్యక్తితో పాటు కారంచేడు పరిధిలోని వైసీపీ నేత అనుచరుడు, చినగంజాం మండల పరిధిలోని ఒకరితో సహా మొత్తం ముగ్గురిపై పీడీయాక్టు ప్రతిపాదనలను అప్పటి జేసీ శ్రీనివాసులు ఎస్పీకి పంపారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతో వాటిని అటకెక్కించారు. తర్వాత రేషన్ మాఫియా జిల్లాలో మరింతగా చెలరేగిపోయింది.





కంపచెట్లతో నిండిపోయిన పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్

నీటి సంఘాల.. సమరం

- ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్
- రైతు వర్గాలతో పాటు గ్రామాల్లో సందడి
- సాధారణ ఎన్నికల తర్వాత జరగనున్న తొలి ఎన్నికలు
- ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ప్రధాన పార్టీలు
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 259 సంఘాలకు ఎన్నికలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా నిర్వీర్యమైన సాగునీటిరంగాన్ని గాడి లో పెట్టే క్రమంలో కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. నిధులు ఇవ్వా ల్సివస్తోందని లేదంటే కాల్వలకు మరమ్మతులపై నీటి సంఘాల నుంచి డిమాండ్లు వస్తాయనో వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను విస్మరించింది. సాగునీటి సంఘాల కు ఎన్నికలు లేకపోవడంతో కాల్వల మరమ్మతులు, వాటి బాగోగులు, నీటి నిర్వహణ ఐదేళ్లుగా జరగ లేదు. దీంతో కాల్వలు అధ్వానంగా మారిపో యి, సాగునీరు సక్రమంగా అందక రైతు లు నష్టపోవాల్సివచ్చింది. ఈ క్రమంలో నీటి పంపిణీలో రైతులను భాగస్వామ్యం చేయడంతో పాటు కాల్వల బాగుకు ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగం గా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహ ణకు ఏర్పాట్లుచేస్తోంది. ఈ నెల 16 నుంచి ఎన్నికల ప్రక్రియను ప్రారంభిం చే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం జర గనున్న తొలి ఎన్నికలు కావడంతో ప్రధాన పార్టీలు వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గ్రామ స్థాయిలో రైతు వర్గాల్లో పట్టు నిలుపుకునేందుకు ఆయా పార్టీల నేతలు సమా యత్తమవుతున్నారు. దీంతో పల్లెల్లో సాగు నీటి ఎన్నికల సందండి ప్రారంభమైంది. నీటి సరఫ రాలో కీలకపాత్ర వహించే సంఘాలకు నేతృత్వం వహించేందుకు రైతులు ముందుకువస్తున్నారు. నాగార్జు నసాగర్ కుడికాల్వ ప్రాజెక్టు కమిటీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 259 నీటిసంఘాలు, 30 డిస్ట్రిబ్యూ టరీ కమిటీలు ఉన్నాయి. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటి పదవీకాలం ముగిసినా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి సంఘాల ప్రాధాన్యాన్ని గుర్తించి ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. ఈ క్రమంలో తొమ్మిదేళ్ల తర్వాత సదరు సంఘాలకు ఎన్నికలు జరగను న్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది.

ఈ సారి కౌలు రైతులకు ఓటు హక్కు

ఈ సారి కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణ అర్హత కార్డులు పొందిన కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించనున్నారు. అయితే కౌలు రైతులు వారు సాగు చేసుకుంటున్న భూముల సర్వే నెంబర్లలో యజమానులకు ఓటు హక్కు ఉండదని అధికారులు చెబుతున్నారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్ల ఆధారంగా నీటి సంఘాల వారీగా ఓటర్లను కేటాయిస్తారు. నీటి సంఘాల పరిధిని ఇప్పటికే జలవనరుల శాఖ గుర్తించింది. చెరువుల ఆయకట్టు పరిధిలోని రైతుల వివరాలను మైనర్ ఇరిగేషన్ శాఖ సేకరించింది. ఒక్కో నీటి సంఘం పరిధిలో ఆయకట్టు ఆధారంగా రైతులకు ఓటు హక్కును కల్పిస్తారు. ఏ సర్వే నెంబరులో ఎంత మంది రైతులు ఉన్నారు. వీరిలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో నిర్ధారిస్తారు. ఈ వివరాలు ఆధారంగా సాగు నీటి సంఘం పరిధిలో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జలవనరుల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఓటర్లను గుర్తిస్తున్నాయి.

సాగునీటి కాల్వలకు మహర్దశ

సాగునీటి సంఘాలకు ఎన్నికలతో కాల్వలకు మహర్దశ పట్టనున్నది. మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. ఎన్నికలు జరగకపోవడంతో సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించారు. నీటి తీరువాకు సంబంధించిన కాడా నిధుల కేటాయింపు కూడా నిలిచిపోయింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి కాల్వల మరమ్మతులకు మొండిచేయి చూపింది. ఈ పరిస్థితుల్లో ఎన్నికలతో మళ్లీ సాగు నీటి సంఘాలకు పూర్వ వైభవం రానున్నది. కాల్వల మరమ్మతులకు పుష్కలంగా నిధులు రానున్నాయి.

కంప చెట్ల మూసుకు పోయిన గోవిందాపురం మైనర్ కాల్వ



40 రోజుల్లో ప్రక్రియ పూర్తి

ఈ నెల 16వ తేదీన సాగునీటి సంఘా ల ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నది. తొలుత సాగునీటి సంఘాలకు ఆ తదుపరి డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఆ తర్వాత ప్రాజెక్టు కమిటీల ఎన్నిక జరగనున్నది. ఈ ప్రక్రియ అంతా 40 రోజుల్లో పూర్తిచేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియపై కలెక్టర్లు, జలవనరులశాఖ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం ప్రత్యేకంగా సమీక్షించారు. సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక సంఘాలను గుర్తించి, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు.

సరస్వతి నమస్తుభ్యం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. అమ్మవారి ఆలయాల్లో గోపూజ, సువాసిని, సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అమ్మవారిని శ్రీ సరస్వతి అమ్మవారిగా అలంకరించారు. విద్యార్థులు సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

- బాపట్ల



రేపల్లె: పట్టణంలోని బూరుగలమ్మ దేవాలయంలో సరస్వతిదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



వేమూరు: జంపని రామేశ్వరాలయంలో సరస్వతిదేవి అలంకారం



కొల్లూరు: భట్టిప్రోలు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు



బాపట్ల: శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సరస్వతీదేవిగా అమ్మవారు



బాపట్ల: చందోలు గ్రామంలో శ్రీసరస్వతీదేవి అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు

మద్యం షాపులకు 1270 దరఖాస్తులు

- గడువు పొడిగింపు.. రేపటి వరకు అవకాశం
- స్పందన తక్కువగా ఉన్న షాపులపై ఈఎస్ సమీక్ష

బాపట్ల(ఆంధ్రజ్యోతి), అద్దంకి, అక్టోబరు 9: మద్యం షాపుల లైసెన్సుల కోసం జిల్లా వ్యాప్తంగా 1270 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు గడువు బుధవారంతో ముగియాల్సి ఉండగా ఈ నెల 11 వరకు అవకాశం ఇస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేషన్ల వారీగా మద్యం షాపులకోసం వచ్చిన దరఖాస్తులపై బుధవారం ఈఎస్ సమీక్ష నిర్వహించారు. ఎక్కడెక్కడ స్పందన తక్కువ ఉందో ఆరా తీసి అక్కడ ఉన్న ఇబ్బందులను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 117 షాపులకు నోటిఫై చేయగా అన్నింటికి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. 30 షాపులకు సంబంధించి సగటున 7 మాత్రమే దఖాస్తులురావడంపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

లాటరీ తీశాక చూద్దాం...

నిన్న మొన్నటి వరకు మద్యం షాపుల విషయంలో సిండికేట్‌కు తెర వెనక నుంచి సహకారం అందిస్తూ వచ్చిన కొంతమంది నేతలు ప్రస్తుతం చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. మద్యం షాపుల లైసెన్సుల విషయంలో కూటమి నేతల జోక్యంపై అధిష్ఠానం సీరియస్‌గా ఉండడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్టు సమాచారం. అధిష్ఠానం ఆగ్రహంతో సిండికేట్ ప్రతిపాదనలకు నేతలు కొంత వెనకడుగు వేసినా ఈ నెల 14న లాటరీ తీసిన తర్వాతనే అసలైన ఆట మొదలుకానుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సంతమాగులూరులో సిండికేట్‌గా

అద్దంకి నియోజకవర్గ పరిధిలో కొన్ని మండలాల్లో ముందస్తుగానే సిండికేట్‌గా మారి మద్యందుకాణాలకు దరఖాస్తులు వేసినట్లు సమాచారం. నియోజకవర్గం పరిధిలో 23 షాపులకు బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి 232 దరఖాస్తులు మాత్రమే అందాయి. మద్యం అమ్మకాలు అధికంగా ఉండే సంతమాగులూరు మండలంలో 5 షాపులకు 20 దరఖాస్తులు మాత్రమే వేయడం అనుమానాలకు తావిస్తుంది. పంగులూరు మండలంలో మూడు దుకాణాలకు అత్యధికంగా 54, అద్దంకి పట్టణంలో 5 షాపులకు 59, మండలంలో రెండు షాపులకు 12, బల్లికురవ మండలంలో నాలుగింటికి 35 దరఖాస్తులు వచ్చాయి.

ముగిసిన విచారణ

- ఎస్టీవో కార్యాలయంలో రికార్డుల పరిశీలన పూర్తి

చీరాల, అక్టోబరు 9: చీరాల ఉప ఖజానా అధికారి కార్యాలయంలో మూడు రోజుల నుంచి కొనసాగుతున్న విచారణ బుధవారంతో ముగిసింది. ట్రెజరీస్ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు విజయనగరం డీటీవో ఆర్‌ఎవ్ కుమార్, మరో ఐదుగురు అధికారుల బృందం విచారణ చేపట్టింది. బృంద అధికారి ఆర్‌ఎవ్ కుమార్ మాట్లాడుతూ ఆరోపణలకు సంబంధించి రికార్డులు పరిశీలించామని, సస్పెండ్ అయిన, బదిలీపై వెళ్లిన వారిని కూడా పిలిచి మాట్లాడినట్లు చెప్పారు. నివేదికను డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్‌కు అందజేస్తామని, వారు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. విచారణ బృందం కోరిన రికార్డులను ఎస్టీవో సుబ్బారావు అందజేశారు. కార్యక్రమంలో విచారణ బృందం సభ్యులు ఐ.రమేష్(ఎస్టీవో విజయనగరం), తులసిరావు(ఎస్టీవో శ్రీకాకుళం), సురేష్‌కుమార్(ఎస్టీవో విజయనగరం), ఫయాజ్ అహ్మద్(ఎస్‌ఏ, ఎస్టీ కర్నూల్), అంజాద్‌పాషా(ఎస్టీవో కర్నూలు) పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మోపిదేవి

- వెంకటరమణరావు, ఆయన తనయుడికి పసుపు కండువా కప్పిన సీఎం

రేపల్లె, అక్టోబరు 9: మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఆయన కుమారుడు రాజీవ్‌లు బుధవారం టీడీపీ కండువా కప్పుకున్నారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోపిదేవి, ఆయన తనయుడ్ని చంద్రబాబు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ అమరావతి సృష్టికర్త అయిన చంద్రబాబుతో కలిసి పని చేస్తానన్నారు. టీడీపీ పార్టీకి అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, నారాయణ, గొట్టిపాటి రవి, ఎంపీ లావు కృష్ణదేవరాయులు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.



మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు,మంత్రులు అనగాని, గొట్టిపాటి, నారాయణ, రవీంద్ర

వైద్య ఆరోగ్య శాఖలో 40 పోస్టుల భర్తీకి చర్యలు

గుంటూరు (మెడికల్) అక్టోబరు 9: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో పని చేసేందుకు వివిధ కేటగిరిల్లో మొత్తం 40 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్‌లు 3 పోస్టులు, ఫార్మసిస్టులు 11, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 11, శానిటరీ అటెండర్లు 15 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆమె వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అక్టోబర్ 16వ తేదీ నుంచి 30వ తేదీలోపు అందజేయాలని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఆయా పోస్టుల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ ప్రజా ప్రతినిధులు


ఎమ్మెల్యే కన్నాను సన్మానిస్తున్న టీడీపీలో చేరిన వైసీపీ ప్రజా ప్రతినిధులు

సత్తెనపల్లి, అక్టోబరు 9: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కన్నా నాయకత్వంలో సత్తెనపల్లి వైసీపీ జెడ్పీటీసీ మెంబర్ సంకటి నాగేశ్వరమ్మ, ఎంపీపీ యలవర్తిపాటి షేక్ జెబున్నీసా బుధవారం కన్నా కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, కట్టా రమేష్, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణను టీడీపీలో చేరిన ప్రజా ప్రతినిధులు, బంధువులు ఘనంగా సన్మానించారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ లీగ్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

మంగళగిరి సిటీ, అక్టోబరు 9: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు బుధవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో కలిసి ఈ పోటీలను ప్రారంభించారు. తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కొద్దిసేపు కబడ్డీ ఆడి ఉత్సాహ పర్చారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ సహకారంతో ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట నాలుగు రోజులపాటు జరిగే కబడ్డీ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 14 పురుషుల జట్లు, 14 మహిళల జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మంత్రి లోకేశ్ వివిధ రకాల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీని క్రీడల్లో అగ్రస్థానంలో నిలబెడతామన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టేడియం పనులను పూర్తి చేస్తామన్నారు. త్వరలో స్పోర్ట్స్ పాలసీని విడుదల చేస్తామని వెల్లడించారు. ఏపీలో అంతర్జాతీయ క్రీడలను నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృఢ సంకల్పంతో ఉన్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం 90 శాతం స్టేడియాలను పూర్తి చేస్తే వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

విజయవాడ క్లబ్‌పై కూడా ఉక్కుపాదం

- మూసేయించిన మంత్రి లోకేశ్
- దీంతో జిల్లాలోని అన్ని క్లబ్‌లలో పేకాట బంద్
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

గుంటూరు, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): జంట నగరాలైన కృష్ణా, గుంటూరు జిల్లాల నడుమ ఉన్న విజయవాడ క్లబ్‌లో కూడా పేకాటకు బ్రేక్‌లు పడ్డాయి. తొలుత ఈ క్లబ్ మినహా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని క్లబ్‌లన్నింటినీ పోలీసులు మూసివేయించారు. అయితే తమకు లేని మినహాయింపు విజయవాడ క్లబ్‌కి ఇవ్వటంతో మిగతా క్లబ్‌ల పాలకవర్గాలు కించిత్ ఆగ్రహానికి గురయ్యాయి. ఒకటి, రెండు రోజుల పాటు కేవలం సభ్యులకు మాత్రమే పేకాట ఆడుకునేందుకు అనుమతి ఉంటుందని నోటీసు బోర్డు పెట్టి విజయవాడ క్లబ్‌లో పేకాట కొనసాగించారు. అయితే 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'టీడీపీలో క్లబ్‌ల చిచ్చు' పేరుతో వచ్చిన వార్తలో విజయవాడ క్లబ్‌కు మినహాయింపు ఇవ్వటం గురించి కూడా రావటంతో మంత్రిగా వ్యవహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే నారా లోకేశ్ పోలీసు అధికారులపై మండిపడినట్లు తెలిసింది. దీంతో ఈ రెండు రోజుల నుంచి విజయవాడ క్లబ్‌లో కూడా పేకాట నిలిచిపోయింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఐదు క్లబ్‌లు మూతపడిపోయాయి. ఇదిలా ఉండగా క్లబ్‌లను అయితే పోలీసులు కట్టడి చేయగలిగారు కానీ అనధికార అడ్డాలలో యథేచ్ఛగా జరుగుతున్న జూదాన్ని మాత్రం కట్టడి చేయకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా చెరుకుపల్లి ప్రాంతంలో అద్దె భవనాల్లో జోరుగా జూదం జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్టీసీ సేవలు మరింత చేరువ చేస్తాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల


నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన మంత్రి మనోహర్

తెనాలి రూరల్, అక్టోబరు 09: ఏపీఎస్ ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం తెనాలి ఆర్టీసీ డిపో నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు బస్సులను మంత్రి మనోహర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ద్వారా ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నామన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆర్టీసీని నిర్వీర్యం చేయడంతో పాటు ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను కల్పించలేదని ఆరోపించారు. తెనాలి డిపోలో వర్షం పడితే మోకాళ్ల లోతు నీళ్లు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారని గతంలో బస్టాండ్ దుస్థితిని వివరించారు. తాము అధికారం చేపట్టిన తర్వాత తెనాలి ఆర్టీసీ డిపోలో వర్షం నీరు నిలవకుండా తగిన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తెనాలి నుంచి హైదరాబాదుకి రెండు ఏసీ బస్సులు, విజయవాడకు మరో రెండు ఎక్స్‌ప్రెస్‌లు, పల్లచెరువుకి వినుకొండ మీదగా మరో రెండు ఎక్స్‌ప్రెస్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత బస్సులకు ప్రత్యేక పూజలను జరిపి అనంతరం రిబ్బన్ కటింగ్ చేసి బస్సు సర్వీస్ ప్రారంభించారు. ఆర్టీసీ డీఎం ఎద్దు రాజశేఖర్, కార్యనిర్వహణాధికారి, తాహసీల్దార్ గోపాల కృష్ణ, డీఎస్పీ జనార్దనరావు, పలు శాఖల అధికారులు, ఆర్టీసీ కార్మికులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకులో మోసం దారుణం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకు వద్ద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, అక్టోబరు 9 : వందల కోట్ల నగదు, వందల సవర్ల బంగారం గల్లంతైనట్లు బాధితులు చెబుతున్నారు.. ఇది ఎంతో దారుణం.. ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఇంత మోసం జరుగుతుంటే యాజమాన్యం ఏం చేస్తుంది అని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. భారీ ఎత్తున గోల్‌మాల్ జరిగిన నేపథ్యంలో చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంక్ బ్రాంచ్‌ని బుధవారం ఆయన సందర్శించారు. బాధితులు, బ్యాంకు సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మూడేళ్లుగా ఒక ప్రముఖ బ్యాంకులో మోసం జరుగుతుంటే ఉన్నతాధికారులు ఎందుకు పసిగట్టలేకపోయారని ప్రశ్నించారు. అక్రమాల్లో బ్రాంచి సిబ్బంది ప్రమేయం కూడా ఉన్నట్లుగా కన్పిస్తుందని అన్నారు. గత నెలలో కూడా డిపాజిట్లు గల్లంతైనట్లుగా సమాచారం ఉందనీ, ఇది పూర్తిగా బ్యాంకు వైఫల్యంగానే పరిగణించాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బాధితులకు అన్యాయం జరగడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకు మేనేజర్, గోల్డ్ అప్రైజర్ చేసిన మోసానికి ఖాతాదారులు బలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేటతోపాటు నరసరావుపేట, విజయవాడ బ్రాంచ్‌లలో కూడా అవకతవకలు జరిగాయని ఆయన అన్నారు. బదిలీ అయిన మేనేజర్ గత నెలలో ఈ బ్రాంచ్‌లో ఒక ఎన్నారైని మోసం చేసి రూ.10 లక్షలు డిపాజిట్ కాజేశారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 100 మంది బాధితులు బయటకు వచ్చారని, వారిలో 76 మంది ఫిర్యాదు చేశారని బ్యాంకు రీజినల్ మేనేజర్ చెప్పారని అన్నారు. ఇంకా బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఆధారాలున్న ప్రతి ఒక్కరికీ నగదు చెల్లిస్తామని బ్యాంకు ఉన్నతాధికారులు చెప్పారని తెలిపారు. ఆధారాలు లేకుండా ఎవరైతే నగదు ఇచ్చారో వాటిపై కూడా విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. బ్యాంకుపై ఒత్తిడి తెచ్చి వారికి న్యాయం చేస్తామన్నారు. సీఐడీకి ఫిర్యాదు చేసినట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారని, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌తో తాను కూడా మాట్లాడతానని చెప్పారు. ఇది సీబీఐ దర్యాప్తుకు వెళ్లాల్సిన కేసు అని అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, సీఎం చంద్రబాబు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి విచారణ జరపాలని కోరుతామన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని చెప్పారు.

పట్టాదారు పాసు పుస్తకం కోసం 30 ఏళ్లగా పోరాటం


పొందుగుల వెంకటరెడ్డి

గుంటూరు సిటీ, అక్టోబరు 9: 10 మంది కలెక్టర్లు.. 18 మంది తహసీల్దార్‌లు .. డజన్ల కొద్దీ వీఆర్వోలు మారారు. అయినా పాసు పుస్తకానికి మాత్రం మోక్షం కలగలేదు. తనకు జరిగిన అన్యాయంపై తాజాగా రాష్ట్రపతికి సైతం లేఖలు రాశారు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన పొందుగల వెంకటరెడ్డి గతంలో షైన్స్ నిర్వహించేవారు. ఆయన నకరికల్లు మండలం త్రిపురాపురంలో 1.50 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. తన షైన్స్‌లో పని చేసే కార్మికులకు ఆవాసం ఏర్పాటు చేసేందుకు గ్రామ సర్వే నంబరు 69లోని 5/1, 5/2లో ఉన్న భూమిని 1994 సెప్టెంబరు 7న కొనుగోలు చేశారు. భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్‌లు కూడా పరిశీలించాకే కొన్నారు. అప్పటి నుంచి సదరు భూమికి అవసరమైన పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ నే ఉన్నారు. అయినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు 2003లో గొప్ప ఘనకార్యానికి తెరలేపారు. వెంకటరెడ్డికి చెందిన పట్టా భూమిని పోరంబోకుగా చూపించి వేమయ్య, వేణుబాబు తదితరులకు పట్టాలు మంజూరు చేశారు. రాంకీ సంస్థకు సదరు భూమిని అప్పజెప్పేందుకు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి పట్టాలు మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై అప్పట్లో బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో ఆఘమేఘాల మీద పట్టాలు రద్దు చేసి, బాధ్యులైన ఉద్యోగులను సస్పెండ్ చేశారు. రెవెన్యూ అధికారుల తప్పిదానికి కోర్టు లు కూడా మొట్టికాయలు వేశాయి. అయినా అధికారులు మాత్రం వెంకటరెడ్డిపై కనికరం చూపించలేదు. వెంకటరెడ్డి ఆధీనంలో ఉన్నది ప్రైవేటు భూమిని జిల్లా సర్వేయర్ కూడా పలుమార్లు నిర్ధారించారు. అయినా అధికారులు పాసుపుస్తకం ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు తనని ఇబ్బంది పెడుతున్న సంగతిని బాధితుడు వెంకటరెడ్డి తాజాగా రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేశారు.

డీఎస్సీ శిక్షణకు కోచింగ్ సెంటర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), అక్టోబరు 9: ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ శిక్షణ కోసం అర్హులైన కోచింగ్ సెంటర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి ఎస్సీ శిక్షణ కోసం ఆసక్తి ఉన్న సంస్థలు ఈ నెల 21లోగా https://tender.apeprocurement.gov.inఅనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో కోచింగ్ ఇచ్చిన అనుభవం, ఇక్కడ శిక్షణ పొందిన వారిలో కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొంది ఉండాలని స్పష్టం చేశారు.

23న ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు

గుంటూరు (మెడికల్) అక్టోబరు 9: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా యూనిట్ ఎన్నికలు ఈ నెల 23న గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎం.తులసీ బ్రహ్మమ్మ తెలిపారు. 14న అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. 16న నామినేషన్ల స్వీకరణ, 17న నామినేషన్ల పరిశీలన, 18న నామినేషన్ల ఉప సంహరణ జరుగుతుందన్నారు. అక్టోబర్ 23న ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా శాఖకు ఎన్నికలు జరుగుతాయని ఆమె ప్రకటించారు.

ఎవరెస్ట్ అధిరోహణకు ఎస్ఆర్ఎం విద్యార్థులు


ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించనున్న ఎస్ఆర్ఎం విద్యార్థుల బృందం

మంగళగిరి సిటీ, అక్టోబరు 9: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంతో సాహసోపేతమైన ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహణకు సన్నద్ధమయ్యారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, దృఢత్వం పెంపొందించే క్రమంలో ఎవరెస్ట్ బేస్ క్యాంపు యాత్రకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఎంటర్‌ప్రిన్యూర్ అండ్ ఇన్నోవేషన్ విభాగం ఆధ్వర్యంలో ఈ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎస్ఆర్ఎం నుంచి మొత్తం 18 మంది ఎవరెస్ట్ యాత్రకు బయల్దేరుతున్నారు. నాలుగు నెలల కిందటే వీరిని ఎంపిక చేసి అధిరోహణకు అవసరమైన అన్ని రకాల శిక్షణ ఇచ్చారు. ముందుగానే నేపాల్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహణకు అవసరమైన అనుమతులు తీసుకున్నారు. మంచుకొండల్లో సులభంగా ఎక్కేందుకు దోహదపడే హైకింగ్ షూస్, హైకింగ్ పోల్స్‌ను సమకూర్చారు. ఎవరెస్ట్ బేస్ క్యాంపును చేరుకునే క్రమంలో మొత్తం 134 కి.మీ నడిచి 5,600 మీటర్ల ఎత్తును అధిరోహించాల్సి ఉంటుంది. ఏపీ నుంచి తొలిసారి ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహణకు బయల్దేరిన యూనివర్సిటీగా ఎస్ఆర్ఎం గుర్తింపు పొందనుంది. యూనివర్సిటీకి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గురువారం విచ్చేయనున్నారు. ఎవరెస్ట్ యాత్రను ప్రారంభించి, వారికి అవసరమైన కిట్స్, మెడల్స్‌ను ప్రదానం చేయనున్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, సీఎల్ఎం డైరెక్టర్ అనూప్, ఎంటర్‌ప్రిన్యూర్ డైరెక్టర్ సిద్ధార్థ శంకర్ త్రిపాఠి తదితరులు పాల్గొంటారు.

10 సైన్స్ కోర్సులకు యూజీసీ డెబ్ అనుమతి

పెదకాకాని, అక్టోబరు 9: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. సైన్స్ కోర్సులు చదవాలని ఆకాంక్షతో ఉన్న ఉద్యోగులు, గృహిణులు, విద్యార్థులకు సువర్ణ అవకాశం లభించింది. విద్యాభివృద్ధికి అనుగుణంగా వర్సిటీ యాజమాన్యం తగు ప్రయత్నాలు చేపట్టింది. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) పరిధిలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్)కు సైన్స్ కోర్సుల కొనసాగింపు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన డెబ్ తాజాగా 2024 - 2025 విద్యా సంవత్సరానికిగానూ 10 సైన్స్ కోర్సులకు అనుమతి ఇచ్చారు. అందులో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, సైకాలజీ, స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, బోటనీ కోర్సులకు అనుమతులు లభించాయి. ఈ సందర్భంగా దూర విద్య కేంద్రం సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైన్స్ కోర్సులు పూర్తి చేయాలనుకున్న వారికి సదవకాశమని తెలిపారు. పది కోర్సులకు దరఖాస్తు చేసుకోగా, అన్నింటికి అనుమతి లభించడం సంతోషమన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్‌లు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరోకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా క్రికెట్ రాష్ట్ర జట్టుకు అఖిల పావని



మంగళగిరి సిటీ, అక్టోబరు 9: ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెట్ జట్టులో మంగళగిరికి చెందిన వాసవి అఖిల పావని స్థానం సంపాదించింది. ఈ నెల 17వ తేదీ నుంచి బరోడా వేదికగా జరగనున్న భారత సీనియర్స్ మహిళా టీ20 క్రికెట్ టోర్నీలో అఖిల పావని పాల్గొననుంది. గత నెల ఒకటో తేదీ నుంచి ఐదు రోజులపాటు ఢిల్లీలో జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఉమెన్ ఐపీఎల్ టీం ఎంపిక పోటీలకు హాజరైన ఆమె అద్భుత ప్రతిభ కనబర్చింది. మంగళగిరి నుంచి ఎంపికైన మొదటి మహిళా క్రికెటర్ పావని కావడం విశేషం. రాష్ట్ర జట్టుకు ఎంపికైన అఖిల పావనికి పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138, 148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

36,741 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 37,958 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 36,741 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,585 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	10000	16000
నెంబరు. 5	9000	12500	నెంబరు. 5	10000	15000
273	8100	14500	273	12000	12500
341	8500	16700	341	9000	16900
4884	11500	11500	4884	13000	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	12000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18500	తేజ	9000	18300
బ్యాడిగి	9000	16500	బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	9500	16500	దేవనూరు డీలక్స్	10000	15500
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	11500



ఇసుకవిధానంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ఉచిత ఇసుక విధానంలో రెండు ప్రాంతాలకు అనుమతి

- కలెక్టర్ జె.వెంకటమురళి
- జువ్వలపాలెం, గాజుల్లంక రేవులలో 74వేల మెట్రిక్‌టన్నుల లభ్యత

బాపట్ల, అక్టోబరు 9 : ఉచిత ఇసుక విధానంలో జిల్లాలో రెండు ఇసుక రేవులు నుంచి ఇసుక తవ్వకానికి ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. ఈ విషయమై బుధవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానది పరివాహక ప్రాంతాలైన కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, గాజుల్లంక గ్రామాలలో ఇసుక లభ్యత ఉన్నట్లు ప్రకటించారు. ఒక్కొక్కరేవు వద్ద 74 వేల మెట్రిక్‌టన్నులకు పైగా ఇసుక లభ్యత ఉన్నట్లు తెలిపారు. జీవోఎంఎస్‌నెంబరు 40 ఆధారంగా రేవులు నుంచి ఇసుక తవ్వటానికి ఏజెన్సీలను ఆహ్వానించటం జరిగిందన్నారు. ఏజెన్సీ ఎంపిక ప్రక్రియ టెండర్‌దశలో ఉందన్నారు. గురువారం సాయంత్రం టెండర్ దరఖాస్తుల గడువు ముగుస్తుందని తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణ అరికట్టటానికి ఇద్దరు ఉపతహసీల్దార్‌లు, ముగ్గురు ఆర్‌ఐలు, పోలీసులను కలిపి కమిటీగా నియమించామన్నారు. 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. 9 చెక్‌పోస్టులు వద్ద తనిఖీలు ఉండాలన్నారు. ఇసుక కొనుగోలుపై రూ పొందించిన ప్రత్యేక యాప్‌లపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వర్, మైనింగ్ ఏడీ రాజేష్, అనుబంధ శాఖల అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

పల్లెపండుగ వారోత్సవాలు జయప్రదం చేయండి : కలెక్టర్

పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలు జయప్రదం చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పంచాయతీ వారోత్సవాలపై జిల్లా, మండలస్థాయి అధికారులతో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. భూమిపూజ చేసే కార్యక్రమాల ఫొటోలను తప్పనిసరిగా పోర్టల్‌లలో నిక్షిప్తం చేయాలన్నారు. గ్రౌండింగ్ చేసిన పనులన్నీ జియోట్యాగ్ చేయాలన్నారు. పంచాయతీల ద్వారా 76.66 కోట్ల రూపాయల నిధులతో 670 పనులు చేస్తున్నారన్నారు. పంచాయతీలోని సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘ నిధులు వస్తాయన్నారు. ఉపాధిహామీ పథకం కింద మరో 564 పనులు మంజూరు కాగా 11.91 కోట్ల రూపాయల నిధులతో పనులు చేపడుతున్నామన్నారు. తాజాగా మరో 130 పనులకు అధికారికంగా ఆమోదం తెలిపినట్లు వివరించారు. సమావేశంలో డీపీవో ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, పీఆర్ ఎస్‌ఈ హరేరామకృష్ణ, డీఎల్‌డీవో సీహెచ్ సువార్త తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు వినతి

బాపట్ల, అక్టోబరు 9 : జిల్లాలోని దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ జె.వెంకటమురళికి జనసేన పార్టీ దివ్యాంగుల నాయకుడు గోగన ఆదిశేషు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలలో అన్నింట్లో దివ్యాంగుల కొరకు ర్యాంప్‌లు, వీల్ ఛైర్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలన్నారు. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లా కేంద్రంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ఇనగంటి శ్రీను మృతి పార్టీకి తీరనిలోటు

బాపట్ల, అక్టోబరు 9 : తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా పని చేసిన నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ఇనగంటి శ్రీనివాసరావు అకాల మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. గుండెపోటుతో హఠాన్మరణం పొందిన ఇనగంటి శ్రీను భౌతికకాయాన్ని బుధవారం అప్పికట్ల గ్రామంలోని ఆయన గృహం వద్ద ఎమ్మెల్యే వేగేశన పార్టీశ్రేణులతో కలిసి సందర్శించారు. ఆయన భౌతికకాయంపై తెలుగుదేశం జెండా కప్పి నివాళులర్పించారు. ఇనగంటి శ్రీను మృతి జీర్ణించుకోలేకపోతున్నామని ఆయన అన్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి మానం విజేత, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ తదితరులు ఉన్నారు.



ఇనగంటి శ్రీనివాసరావు భౌతికకాయంపై పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

31 పాఠశాలల్లో పదిరకాల వృత్తి విద్యకోర్సులు

- జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు



మొక్కలు పంపిణీ చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి నారాయణరావు

బాపట్ల, అక్టోబరు 9 : జిల్లాలోని 31 పాఠశాలల్లో 1, 2 చొప్పున 10 రకాల వృత్తి విద్య కోర్సులు జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు తెలిపారు. యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య కోర్సులు చేస్తున్న విద్యార్థులు నందిరాజుతోటలోని హరితపల్లవం గార్డెన్స్‌లో ఇంటెన్‌షిప్ చేస్తుండగా బుధవారం డీఈవో సందర్శించారు. విద్యార్థినులు మొక్కల గ్రాఫ్టింగ్, బయోపెస్టిసైడ్స్ తయారీ, నర్సరీ పాటింగ్ లాంటి ఎన్నో అంశాలు నేర్చుకున్నట్లు గుర్తించారు. ఒకేషనల్ ట్రైనర్ సి.అర్పిత, నర్సరీ యాజమాన్యం పి.లక్ష్మీలు విద్యార్థులకు తగు సూచనలు చేశారు. డీఈవో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పాఠశాలలకు అదనంగా మరో 5 స్పోక్ పాఠశాలల్లో కూడా ఈ సంవత్సరం వృత్తి విద్యాకోర్సులను ప్రవేశపెట్టామని, కోర్సులలో విద్యార్థులకు 10వ తరగతి మాదిరిగానే సర్టిఫికెట్ ఆధారిత పరీక్షలు జరుగుతాయన్నారు. ఆ సర్టిఫికెట్‌ల ద్వారా వివిధ రకాల ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలియజేశారు.

లారీ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలు

బాపట్లరూరల్, అక్టోబరు 9 : లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామసమీపంలోని రహదారిపై బెంగుళూరు నుంచి ద్రాక్షా లోడ్‌తో ఒడిస్సా వైపు వెళుతున్న లారీ ఎదురుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయణిస్తున్న యువకుడి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్ ద్వారా అతనిని బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుళికల మందు తిని పది గొర్రె పోటేళ్ళు మృతి

బాపట్లరూరల్, అక్టోబరు 9 : బాపట్ల మండలం మరుప్రోలువారిపాలెం గ్రామానికి చెందిన పుట్టా బాజిరెడ్డికి సంబంధించిన గొర్రె పోటేళ్ళు గుళికల మందు తినటంతో పది మృతి చెందాయి. మరణించిన గొర్రెపోటేళ్ళ విలువ 2 లక్షల 50 వేల వరకు ఉంటాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబ జీవనాధారమైన గొర్రె పోటేళ్ళు మృతి చెందటంతో ప్రభుత్వం సాయం చేయాలని వేడుకున్నాడు.

14 వాహనాలపై కేసులు నమోదు

బాపట్ల, అక్టోబరు 9 : పట్టణంలో సీఐ ఆర్.అహ్మద్‌జానీ బుధవారం వాహనాల తనిఖీ విస్తృతం చేపట్టారు. ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తూ వాహనపత్రాలను పరిశీలించారు. లైసెన్స్, ఇతర పత్రాలు లేని 14 మందిపై కేసులు నమోదు చేశారు. సూర్యలంకరోడ్డులో నిర్వహించిన ఈ తనిఖీలలో సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్ల టౌన్‌హాలులోని శ్రీలలిత త్రిపుర సుందరి పీఠం ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీదేవిగా అమ్మవారు



బాపట్ల రాజీవ్‌గాంధీకాలనీలో శ్రీ సరస్వతీదేవిగా అమ్మవారు



చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో సరస్వతిదేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి



కొల్లూరులో సరస్వతీదేవి అలంకారంలో సత్యజ్ఞానప్రసూనాంబ అమ్మవారు

సరస్వతీ నమస్తుభ్యం... వరదే కామరూపిణి

- సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

బాపట్ల, అక్టోబరు 9 : శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బాపట్ల పట్టణ, మండలంలో అమ్మవారు బుధవారం శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యలంకరోడ్డులోని టౌన్‌హాలులో శ్రీ లలిత త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలలో శ్రీ సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రీతీకరమైన పద్మపుష్పార్చన, కుంకుమార్చన, విశేషనివేదనలు అనంతరం తీర్థప్రసాద వినియోగం గావించారు. బుధవారం కావటంతో బుధగ్రహ ఆరాధన, దీపార్చన, అనంతరం మహిళలచే శ్రీ లలితసహస్రనామ పారాయణం జరిగింది. పీఠం నిర్వాహకులు నెమలి కంటి హనుమంతరావు, పంగులూరి కౌండిన్యశర్మ, మల్లోలు లింగారావు, దర్శి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలో నిర్వహిస్తున్న వేడుకలలో, ఎస్ఎన్‌పి అగ్రహారం శ్రీ ప్రసన్నాదుర్గాభవానీమాత ఆలయంలో, బాపట్లపాతబస్టాండ్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు దేవస్థానంలో, కొత్తబస్టాండ్‌లోని శ్రీ రుక్మిణి సమేత పాండురంగాస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వేడుకలలో కూడా అమ్మవారు శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తికి పంచామృత స్నపన కార్యక్రమం అనంతరం బాలబాలికలచే కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పూజలో పాల్గొన్న 70మంది పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు పర్యవేక్షించారు.



కూచిపూడి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకరణ



చావలి గోగులమ్మ ఆలయంలో అమ్మవారికి విశేషాలంకరణ

- వేమూరు, అక్టోబరు 9 : శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగం గా బుధవారం ఏడవ రోజు మూలానక్షత్రం పురస్కరించుకుని ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి అంటూ అమ్మవారిని సరస్వతి దేవి రూపంలో ప్రార్థించి చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. చావలి వాలేశ్వరాలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. చావలి గ్రామదేవత గోగులమ్మ ఆలయంలో వార్షిక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని లక్ష్మీ స్వరూపంగా భావించే వేప ఆకులతో అలంకరించారు. జంపని రామేశ్వరాలయంలో ఊంజల సేవ జరిపారు. వేమూరు, పెరవలి, బూతుమల్లి, వరహాపురం, అబ్బనగూడవల్లి, చదలవాడ శివాలయాల్లో స్వామి వారికి అభిషేకాలు జరిపి అమ్మవారిని విశేషంగా పూజించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.
- రేపల్లె, అక్టోబరు 9 : దసరా మహోత్సవం 7వ రోజు బుధవారం శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా మూలనక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం విఘ్నేశ్వరపూజ, అమ్మవారికి కుంకుమపూజ, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో చిన్నారులకు అర్చకులు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేశారు. కుంకుమార్చన ఆయా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో, రైలుపేట అభయాంజనేయస్వామి దేవాలయంలో, శారదాపీఠంలో, రెల్లీకాలనీలో, 3వ వార్డు రామమందిరం వద్ద, అరవపల్లి గ్యాస్‌కంపెనీ వద్ద దేవీశరన్నవరాత్రిలో భాగంగా తొలిరోజు అమ్మవారికి కుంకుమ పూజ, లలితా సహస్రనామం తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.
- అమృతలూరు, అక్టోబరు 9 : మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతీదేవిగా బుధవారం అలంకరించారు. మండలంలోని కూచిపూడి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో, గోవాడ శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయంలో, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అమ్మవారిని సర్వతీదేవిగా అలంకరించారు. చిన్నారులు పలు చోట్ల పూజల్లో పాల్గొన్నారు. అమృతలూరు క్రొత్తపల్లి వారి రామమందిరం వద్ద నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.
- కొల్లూరు, అక్టోబరు 9 : మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో అమ్మవార్లను సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని పార్వతీ అమ్మవారి దేవస్థానంలో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలనక్షత్రం సందర్భంగా పార్వతి దేవాలయంతో పాటు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించి సామూహిక సరస్వతీ పూజ చేశారు. మండల పరిధిలోని కోటిపల్లి సోమశేఖర స్వామి దేవస్థానంలో సత్యజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకారం చేశారు.
- భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 9 : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ అమ్మవారి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించిన అనంతరం బుధవారం సరస్వతి పూజలు చేయించారు. రాత్రివేళ తొమ్మిది మంది ముత్తైదువులకు సువాసిని నవదుర్గా పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబు, గౌరవాధ్యక్షులు చినబుచ్చియ్య, ఆలపాటి ఉపేంద్ర, మాజేటి వెంకటేశ్వరరావు, మహిళా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- కర్లపాలెం, అక్టోబరు 9 : కర్లపాలెం మండలం నల్లమోతువారి పాలెం గ్రామంలోని ప్రజారాజ్యం సెంటర్, పాలకేంద్రం వద్ద వంగవీటి రంగా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజున మూలనక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీపెద్దింటమ్మతల్లి కల్యాణ మండపంలో దేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కర్లపాలెం బంగారురెడ్డిపాలెంలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు పూజలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆట్ల బాలిరెడ్డి పద్మావతి దంపతులు పూజలు చేశారు. కర్లపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని సత్యవతిపేటలో అమ్మవారి శ్రీసరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు శ్రీరామ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు కేశవరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, సాంబశివరెడ్డి, కొండలురెడ్డి, బాబులురెడ్డి పాల్గొన్నారు.
- చెరుకుపల్లి, అక్టోబరు 9 : గ్రామగ్రామాన దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు భక్తులకు బుధవారం సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. కావూరు గ్రామంలోని శ్రీరామ లింగేశ్వరస్వామి, గుళ్ళపల్లిలోని శ్రీఆనందీశ్వరి స్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. అదే విధంగా పలు దేవాలయాల్లో మూలా నక్షత్రం కావడంతో చిన్నారుల చేత సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.
- చుండూరు, అక్టోబరు 9 : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వలివేరులోని శ్రీలలితాంబ సమేత శ్రీస్వయంభువేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు బుధవారం సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా జరిపిన ప్రత్యేక పూజల్లో చిన్నారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చినపరిమి గంగాపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాసరస్వతిదేవి అలంకరణలో దర్శనమివ్వగా పూజల్లో తల్లిదండ్రులతో పాటు చిన్నారులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పూజారులు అందించారు.

పిట్టలవానిపాలెం, అక్టోబరు 9 : మండలంలోని చందోలులో ఉన్న శ్రీబగళాముఖి అమ్మ వారుశ్రీ సరస్వతీదేవిగా అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. అల్లూరులో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



శ్రీపెద్దింటమ్మతల్లి కళ్యాణ మండపంలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



వలివేరులో సరస్వతిదేవిగా అమ్మవారు



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు రమాదేవి

ఏచూరి సేవలు చిరస్మరణీయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి

బాపట్ల, అక్టోబరు 9 : బహుముఖ ప్రజ్ఞాశాలి, సిద్ధాంతవేత్త, పీడీత ప్రజలపాలిట యోధుడు సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. బాపట్లలోని ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమానికి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సభలో మాట్లాడుతూ భారతదేశంలో ప్రస్తుతం బీజేపీ అవలంబిస్తున్న మతోన్మాదవిధానాలకు వ్యతిరేకంగా ప్రజలను అనేక పార్టీలు నుండి కూడ గట్టి లౌకిక పరిరక్షణ పోరాటం చేయటంలో ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్రంలో సనాతన ధర్మంతో ముందుకొస్తున్నారని వీరికి రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టవన్నారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అధ్యక్షత వహించగా విశ్రాంత ప్రొఫెసర్ విజయ్‌కుమార్, న్యాయవాది జెడ్.బాషా, కిషోర్‌బాబు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ బాబురావు, జనవిజ్ఞానవేదిక నాయకులు రామారావు, భాస్కరరావు తదితరులు పాల్గొని ఏచూరికి ఘన నివాళులర్పించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం, అక్టోబరు 9 : మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10న ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

పల్లెపండుగలో అందరూ భాగస్వాములుకావాలి

- ఎంపీడీవో బాబురావు

బాపట్ల రూరల్, అక్టోబరు 9 : పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు గ్రామాలలో జరగనున్న పల్లెపండుగ కార్యక్రమానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అవ్వాలని ఎంపీడీవో బాబురావు అన్నారు. బాపట్ల ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామపంచాయతీల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు గ్రామపంచాయతీ పరిపాలన గురించి బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిర్వహించవల్సిన ప్రాథమిక విధులైన తాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యంతోపాటు ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ సంక్షేమ పథకాలు, వాటి అమలు గురించి ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పల్నాటి శ్రీరాములు, సుధాకర్, మరియమ్మ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు కొట్టారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బాపట్లరూరల్, అక్టోబరు 9 : పోలీసులు కొట్టారంటూ ఓ వ్యక్తి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బాపట్ల మండలం ఈతేరు గ్రామానికి చెందిన పున్నయ్య మద్యం విక్రయిస్తున్నాడంటూ మంగళవారం బాపట్లరూరల్ పోలీసులు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళటం జరిగింది. అయితే పున్నయ్య పోలీసులు తనను కొట్టారని మనస్థాపానికి గురై బుధవారం పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించగా వైద్యులు చికిత్స అందించి ఎటువంటి ప్రాణాపాయం తెలిపారు.

ఈ విషయంపై బాపట్ల రూరల్ సీఐ కె.గంగాధరరావును వివరణ కోరగా అతను మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని అతనికి నోటీసు ఇవ్వటం జరిగిందని, అంతేకాని అతనిపై ఎటువంటి దాడికి పాల్పడలేదన్నారు. మద్యం విక్రయిస్తున్నాడని పున్నయ్యపై కేసు నమోదు చేయటం జరిగిందని సీఐ తెలిపారు.

డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఆర్డీవో



ఆర్డీవోగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న రామలక్ష్మి

రేపల్లె, అక్టోబరు 9 : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయటంతో పాటు డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి అన్నారు. ఆమె బుధవారం ఆర్డీవోగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్డీవోగా పనిచేసిన హేలా షారోన్ బదిలీపై కృష్ణా జిల్లా ఉయ్యూరు వెళ్ళారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. వివిధ రకాల పనులపై ఆర్డీవో కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వరమే పరిష్కారమార్గం చూపి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న జి.రఘునాథరెడ్డి

బాపట్ల, అక్టోబరు 9 : బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా జి.రఘునాథరెడ్డి బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌ను గతంలో ఆయన పనిచేసిన కేంద్ర సర్వీస్‌కు పంపించారు. కేంద్రసర్వీస్‌లో పని చేస్తూనే డిప్యూటేషన్‌పై ఆయన ఇక్కడకు వచ్చారు. తిరిగి అదే శాఖకు పంపించి ఆయన స్థానంలో పొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న రఘునాథరెడ్డిని ఇక్కడ నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి, పారిశుధ్యం నిర్వహణకు, తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రజా ప్రతినిధులకు రెండు రోజుల శిక్షణ

వేమూరు, అక్టోబరు 9 : ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక రోశయ్య మీటింగు హాలులో గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజా ప్రతినిధులకు బుధవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈవోపీఆర్డీ శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రైనర్ సాధిక్ అలీ మాట్లాడుతూ, సర్పంచ్‌లు, వార్డుల సభ్యులు, కార్యదర్శులు, గ్రామ పరిపాలన విధానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రధానమైన పది అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు వనరుల కల్పన, విధులు, బాధ్యతలు, లే అవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులు, కోర్టు కేసులు, ఆర్థికపరమైన పలు అంశాలను అమలు పరిచే విధానంలో చట్టపరమైన అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిక్షణ కార్యక్రమంలో చదలవాడ కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ అనురాధ చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు.

సిలబస్ తగ్గించాలని ఏపీఎస్‌ఎస్‌టీఎఫ్ సభ్యుల వినతి

కొల్లూరు, అక్టోబరు 9 : సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశాలు తగ్గించాలని కోరుతూ ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డికి ఏపీఎస్‌ఎస్‌టీఎఫ్ ప్రతినిధులు బుధవారం వినతి పత్రం అందించారు. మారిన పదవ తరగతి సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశాలు ఎక్కువగా ఉండటం వల్ల బోధన సమస్యతో పాటు విద్యార్థులపై అదనపు భారంపడుతుందన్నారు. రోజుతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను విద్యా బోధనకు కేటాయించాలని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కునటి సురేష్ తెలిపారు. ఆయా సమస్యలపై విజయవాడలోని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు సిలబస్ తగ్గింపుపై వినతి పత్రం అందించినట్లు ఏపీ అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి అన్నాజీ పాల్గొన్నారు.

అరాచక సంస్కృతికి నిదర్శనం నందిగం ఫోర్జరీ చరిత్ర : కొల్లా

బాపట్ల, అక్టోబరు 9 : మాజీ ఎంపీ నందిగం సురేష్ హైకోర్టుకు ఫోర్జరీ తప్పుడు అనుమతి పత్రాలు సమర్పించి, ఆయన నిర్మించుకున్న ఇంటిపై చర్యలు తీసుకోకుండా స్టే పొందటం వైసీపీ నీచ, దగాకోరు సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తుందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈవిషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఒక ఎంపీగా పని చేసిన వ్యక్తి ఫోర్జరీ పత్రాలతో మోసగించటం క్షమార్హం కాదన్నారు. వైసీపీ హయాంలో న్యాయ స్థానాలలో వీగిపోయినన్ని కేసులు మరే ప్రభుత్వంలో వీగిపోయి కోర్టుల ముందు తలదించుకోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం పెద్దల దాష్టికాన్ని తట్టుకోలేక తప్పుడు పనులు చేసి కోర్టుల ముందు దోషులుగా నిలవటం అందరికీ తెలిసిందేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో పని చేసిన అధికారులంతా జాతీయ స్థాయిలో పదోన్నతులు పొంది పేరు ప్రఖ్యాతులు సాధించారన్నారు. జగన్ పాలనలో పని చేసిన అధికారులు అపఖ్యాతి పాలై జైలుకెళ్ళటం జగమెరిగిన సత్యమని కొల్లా అన్నారు.

శిక్షణా సంస్థలు 21వ తేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలి

- జిల్లా ఎస్సీసంక్షేమ, సాధికారిత అధికారిణి జె.రాజదెబోరా

బాపట్ల, అక్టోబరు 9 : ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణనివ్వాలని సాంఘిక గిరిజన సంక్షేమశాఖలు నిర్ణయించినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారిణి జె.రాజదెబోరా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన సంస్థలలో సాంఘిక, గిరిజన సంక్షేమశాఖలు స్టడీసర్కిల్స్ నిర్వహించబడుతాయన్నారు. కావున శిక్షణ ఇచ్చేందుకు కోచింగ్ సెంటర్‌లు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్ కోచింగ్ ఇచ్చి ఉండాలని, డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొంది ఉండాలని, మూడు సంవత్సరాల టర్నోవర్ 40 లక్షల రూపాయలు ఉన్న కోచింగ్ సెంటర్‌లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. వివరాలకు ఈవోఐ డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

పురాతన మహిషాసుర విగ్రహ ఛాయా చిత్ర ప్రదర్శన

చుండూరు, అక్టోబరు 9 : దేశ విదేశాల్లోని పురాతన మహిషాసుర విగ్రహ ఛాయ చిత్ర ప్రదర్శన మోదుకూరులో నిర్వహిస్తున్నట్లు పురావస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ గ్రామంలో ప్రసిద్ధి శ్రీకనకదుర్గ అమ్మవారి జాత, నవరాత్ర ఉత్సవాలు పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలోని శ్రీ వేమన సాహిత్య వికాస పరిషత్ భవన్‌లో జరిగిన ఈ ప్రదర్శనలో అలనాటి విగ్రహాల చారిత్రక ప్రాముఖ్యత, శిల్పకళా నైపుణ్యం సందర్శకులకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని కాకతీయ విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పోలవరపు హైమావతి ప్రారంభిస్తారని గురు, శుక్రవారాల్లో ఈ ఛాయా చిత్ర ప్రదర్శన ఉంటుందని విద్యార్థులు, చరిత్ర పరిశోధకులు, భక్తులు ఈ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

మద్యం షాపుల కోసం 83 దరఖాస్తులు

వేమూరు, అక్టోబరు 9 : వేమూరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల స్థాయిలో 12 మద్యం షాపుల ఏర్పాటుకు బుధవారం సాయంత్రానికి 83 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ రవి తెలిపారు. వేమూరు మండలంలో మూడు మద్యం దుకాణాలకు 37, అమృతలూరు మండలంలో రెండు దుకాణాలకు 17, చుండూరు మండలంలో మూడు దుకాణాలకు 12, కొల్లూరు మండలంలో నాలుగు దుకాణాలకు 17 దరఖాస్తులు అందినట్లు సీఐ వివరించారు.

ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 9 : ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల ఉపసర్పంచ్‌లు, గ్రామ వార్డు సభ్యులకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బుధవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటలలితకుమారి పాల్గొని 15వ ఆర్థిక సంఘం నిధులు ఇంటి పన్నులు, తదితర వాటిని ఏ విధంగా ఖర్చు చేయాలి, ఎంత పనికి ఎంత కేటాయించాలి, తీర్మానాల ద్వారా ఏయే పనులకు ఖర్చు పెట్టాలో తదితర అంశాలపై పంచాయతీ పాలకవర్గ సభ్యులు శిక్షణ పొంది ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్‌వి రమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలి

రేపల్లె, అక్టోబరు 9 : రైతులను ఆధునిక వ్యవసాయ సాంకేతికపై అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఆర్.విజయబాబు అన్నారు. మండలంలోని అరవపల్లి, నల్లూరు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి పంటను రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏవోలు కె.సుమన్,డి.అమూల్య తదితరులు పాల్గొన్నారు.

» సాగర్ కాలువ చివరి భూములకు రాని సాగు నీరు
» ట్రాక్టర్ ఇంజన్ల సాయంతో తడులు
» పెరుగుతున్న పెట్టుబడి » సాగుదారుల ఆందోళన


పొగనారు మళ్లకు నీరు పెడుతున్న మహిళ


కుంటలో నీటిని ఇంజన్ ద్వారా నారుమడికి పెడుతున్న రైతు

నారుమళ్లు.. తడికోసం తంటాలు

అన్నీ అనుకూలంగా ఉంటే వ్యవసాయం లాభసాటి. లేదంటే నష్టం తప్పదు. అదునులో పదును కావాలి. పదును భూమిలో విత్తనం పడాలి. అనంతరం సాగునీరు (వర్షం లేదా ఇతర వనరుల నుంచి) అందాలి. సకాలంలో సస్యరక్షణ చర్యలు, మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలి. పంట దిగుబడులు చేతికి అందే వరకు ప్రకృతి వైపరీత్యాలు ఉండకూడదు. ఇదంతా జరిగితేనే రైతు, కూలీకి నాలుగు రూపాయలు మిగిలేది. లేదంటే నష్టాలు మూటగట్టుకోవాల్సిందేనని రైతులు ముక్తకంఠంతో చెప్తున్నారు.

చీరాల, అక్టోబరు 9 : ఇంకొల్లు, గొల్లపాలెం మధ్య సాగరు కాలువ ఆయకట్టు పరిధిలోని చివరి భూములలో పొగనారుమళ్లు సాగు చేస్తున్నారు. గత ఏడాది వైట్‌బర్లీ, బ్యారన్ పొగాకుకు మంచి ధరలు పలికాయి. ఈ ఏడాది కూడా వైట్ బర్లీ, బ్యారన్ పొగాకు విస్తీర్ణం పెరగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని పలువురు రైతులు పొగాకు నారమళ్ల సాగుచేస్తున్నారు. సాగర్‌ఆయకట్టు చివరి భూములు కావడంతో సాగునీరు రావడం లేదు. రెండో వైపు కొమ్మమూరు కాలువ పరిధిలో ఎత్తిపోతల పథకం నుంచి వచ్చే సాగునీరు సాగుదారులకు సక్రమంగా అందడం లేదు. దీంతో రైతులు సమీపంలో చెరువులో నీటిని ట్రాక్టర్ ఇంజన్, ఆయిల్ ఇంజన్లతో పంప్‌చేస్తూ పైప్‌లైన్ల ద్వారా నారుమళ్ల నీటి తడులు ఇస్తున్నారు. ఇది అదనపు ఖర్చు. దీంతో పెట్టుబడులు పెరుగుతున్నాయని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారుమళ్లకు దుక్కి దున్నకం, బెడ్లు ఏర్పాటు, విత్తనాలు చల్లడం, ఎరువులు, పురుగుమందులు, నీటి తడులు, కూలీ, కౌలు తదితరాలను లెక్కిస్తే ఎకరాకు సుమారు రూ.3లక్షల వరకు ఖర్చవుతుంది. అన్నీ సక్రమంగా ఉండి నారు విక్రయాలు జరిగితే నాలుగు రూపాయలు మిగులుతాయి. నారుమళ్లలో సస్యరక్షణ కీలకం. వరుస వర్షాలు లేదా మంగువాతావరణం ఉండకూడదు. బెట్టకు రాకూడదు. ఉదయం, సాయంత్రం నీటిని పైపాటును పిచికారీ చేయాల్సిందే. కాలువలో నీరులేక పోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కాలువకు సాగునీరు వచ్చే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఆ పరిధిలో నారుమళ్లతో పాటు ఇతర పంటలు సాగుచేసిన, చేయాల్సిన రైతులు కోరుతున్నారు. అందుకు అనుగుణంగా అధికారగణం స్పందిస్తారని ఆశిద్దాం.

ముంపు గ్రామమైన మణికేశ్వరం సమస్యలు పరిష్కరించాలి

అద్దంకి, అక్టోబరు 9 : కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాలలో ఒకటైన మణికేశ్వరం గ్రామస్థుల సమస్యలను పరిష్కరించాలని పలువురు అద్దంకి నియోజవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ నేతలు బుధవారం ఒంగోలులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కాలనీ వాసులు, ముస్లిం కాలనీల స్థలాలకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలని, ముంపు గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.


సునీల్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవాలి

ఈవోఆర్డీ సుమంత్

పంగులూరు, అక్టోబరు 9 : గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ముందుగా తగిన ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలని ఈవోఆర్డీ కె.సుమంత్ సభ్యులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో వార్డు సభ్యుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. పంచాయతీలలో చేపట్టాల్సిన పనుల నిర్వహణపై ఆర్పీ సునీత సభ్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్పీ సునీత

సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు

తహసీల్దార్ గోపీకృష్ణ



చీరాలటౌన్, అక్టోబరు 9 : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఎస్టీ సామాజిక వర్గానికి సంబంధించి గ్రామాలకు దూరంగా ఉంటూ పథకాలు అందక ఇబ్బంది పడుతున్నవారి కోసం ప్రత్యేక సర్వేను చేపట్టారు. ఇప్పటికే సుమారు 56 మందిని గుర్తించినట్లు తహసీల్దార్ తెలిపారు. మిగిలిన వారిని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారన్నారు. ఎస్టీ వాసులు వారి వివరాలను అధికారులకు ఇచ్చి సహకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి జనన ధ్రువపత్రం, ఆధార్ కార్డును అందిస్తున్నట్లు గోపీకృష్ణ తెలిపారు.

సరస్వతీదేవి అలంకరణలో అమ్మవార్లు



అద్దంకి : సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి పంగులూరు శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయంలో

అద్దంకి, అక్టోబరు 9 : దసరా శరన్నవరాత్రులలో భాగంగా బుధవారం పలు దేవాలయాలలో సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారులు భక్తులకు దర్శనమిచ్చారు. అద్దంకి పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో సరస్వతి దేవిగా, దత్తపాదుకాక్షేత్రంలో మహాసరస్వతిదేవిగా శింగరకొండలోని గాయత్రి పరమేశ్వరి దేవాలయంలో సరస్వతిదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంగులూరు : 7వ రోజు అమ్మవారిని సరస్వతీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో దర్శన మిచ్చిన పార్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. పంచాయతీ కూడలిలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. చందలూరు రేణుకమ్మతల్లి, రేణంగివరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

పర్చూరు : పలు దేవాలయాల్లో అమ్మవార్లు శ్రీ సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ అద్దంకి నాంచారమ్మ, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామానాగేశ్వరావు పర్యవేక్షణలో స్వామివార్లకు పూజలు జరిగాయి. శ్రీ వాసవీ ఆలయ అధ్యక్షుడు శ్రీరాం వెంకట సుబ్బారావు నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో కూడా నవరాత్రి పూజలు విశేషంగా నిర్వహిస్తున్నారు.


పర్చూరు నాంచారమ్మ ఆలయంలో

మార్టూరు : శ్రీదుర్గామల్లీశ్వరి దేవస్థానంలో బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. మహిళలు పిల్లలతో కలిసి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఘట్టేశ్వరస్వామి, బొడ్డురాయి సెంటర్‌వద్ద వాసవీ అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఇంకొల్లు : కృష్ణమందిరంలో అమ్మవారిని బుధవారం సరస్వతీదేవిగా అలంకరించారు. భక్తులు, విద్యార్థులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాట ప్రదర్శన అలరించింది.



మార్టూరులో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు, ఇంకొల్లులో పారాయణం చేస్తున్న భక్తులు


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో కె.స్వరూపారాణి

14 నుంచి గ్రామాల్లో పల్లె పండుగ

ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, అక్టబరు 9 : గ్రామాలలో ఈ నెల 14 నుంచి జరిగే పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి కె.స్వరూపారాణి కోరారు. పల్లె పండుగ కార్యక్రమం నిర్వహణపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో ఎంపీడీవో స్వరూపారాణి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఏ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల ప్రారంభించేందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. 100రోజుల పనిదినాలకు సంబంధించిన ప్రణాళిక రూపకల్పన, గోకులాల షెడ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఈవోఆర్డీ కె.సుమంత్, ఏపీవో సంతోషం, ఈసీ మురళి, సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి పాటించాలి

పంగులూరు, అక్టోబరు 9 : పంట సాగుకు మందు రైతులు విత్తన శుద్ధిని పాటించాలని, సేంద్రియ పద్ధతులను అనుసరించాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు, కొప్పెరపాడు గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న మినుము పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎనికపాటి కల్యాణ్, శ్రీనివాసరావు, పచ్చా శ్రీనివాసరావు, పశు సంవర్థక, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్, అక్టోబరు 9 : పొగాకు సాగు తగ్గించి అపరాలు పంటలు ఎక్కువగా సాగు చేసుకోవాలని సహాయ వ్యవసాయ అధికారి కె.ధనరాజ్ సూచించారు. బుధవారం మండలంలోని ధేనువకొండ, గోపాలపురం గ్రామాలల్లో పోలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, సాగు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, ఉద్యాన అధికారి ఎస్ దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తుపాకుల పద్మా, గ్రామ వ్యవసాయ సహాయకలు శేషయ్య, వీరేష్, రాఘవయ్య, నరసింహారావు, యర్రా చలపతిరావు పాల్గొన్నారు.

బల్లికురవ : వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి కుమారి అన్నారు. చెన్నుపల్లి, ముక్తేశ్వరంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో సిబ్బంది సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు : ఎద పద్ధతిపై వరి పంటను సాగు చేయడం వలన రైతులకు నారు పెంచడం, నాట్లు వేయడంపై సుమారు ఎకరాకు రూ.8వేలు ఖర్చు తగ్గుతుందని సహాయ వ్యవసాయ సంచాలకుడు కేవీ శ్రీనివాసరావు అన్నారు. బొల్లాపల్లి, తాటివారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ మాట్లాడుతూ రబీలో మొక్కజొన్న సాగుచేసే అవకాశం ఎక్కువగా ఉందని, ఈ పంట సాగు చేసే రైతులు లైసెన్సు కలిగిన డీలర్ల నుంచి విత్తనాలను కొనుగోలు చేయాల సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి హనుమంతనాయక్, పశు వైద్యాధికారి మాధవీలత, సర్పంచ్ నార్నె సింగారావు, వీరవల్లి కృష్ణ మూర్తి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : మిరపపంటలో చిన్నపాటి మెలకువలు పాటిస్తే తక్కువ ఖర్చుతో లాభాలు పొందవచ్చునని ఉద్యానశాఖ అధికారి రవిప్రకాశ్ అన్నారు. గంగవరం, నాగండ్ల గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయసంచాలకులు, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం మండలం నీలాయపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయాధికారి భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి 3 సంవత్సరాలకోసారి పొలంలో జింకు వేసుకోవాలని, శనగ రైతులు విత్తనశుద్ధిని చేసుకోవాలని సూచించారు.

తండ్రీకుమారుల అరెస్ట్

మార్టూరు, అక్టోబరు 9 : మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన తండ్రి ఈమని సాంబయ్య, అతని కుమారుడు దుర్గా ప్రసాద్‌ను బుధవారం అరెస్ట్ చేసి అద్దంకి కోర్టులో హాజరుపరిచినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు తెలిపారు. గత నెలలో వారిద్దరూ అదేగ్రామానికి చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచారన్నారు. ఆసుపత్రి నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాగర్ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వలపర్ల పంచాయతీ పరిధిలో జంగమహేశ్వరపురం సమీపంలోని సాగర్ కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం మార్టూరు పోలీసులు వెలికితీశారు. వలపర్ల వీఆర్‌వో ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. అతని శరీరంపై ఎలాంటి దుస్తులు లేవు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు. మృతిచెందిన వ్యక్తికి సంబంధించి ఎలాంటి సమాచారం లేదని, 40 ఏళ్ల వయస్సు ఉంటుందని శేషగిరిరావు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అమ్మ ఆశ్రమానికి ఆర్థిక సాయం

మార్టూరు, అక్టోబరు 9 : అమ్మ ఆశ్రమానికి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి దంతనాల కనక రత్నాచారి పద్మావతి దంపతులు రూ.25 వేల విరాళాన్ని ఇచ్చారు. తమ కుమార్తె వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆర్థిక సాయాన్ని ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు అందచేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కారు ఢీకొని బాలుడికి గాయాలు

బల్లికురవ, అక్టోబరు 9 : సైకిల్‌పై వెళ్తున్న బాలుడిని కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వి.కొప్పెరపాడులో బుధవారం ఉదయం బాలుడు హైవేపై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. కారు ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు వెంబడించి కొమ్మాలపాడు వద్ద ఆపారు. బాలుడికు చేతికి, ముఖంపై గాయాలయ్యాయి. నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు.



అంతా ఫ్రీ హోల్డ్!

జిల్లాలో లక్షా 82వేల ఎకరాలకు యాజమాన్య హక్కులు

గత వైసీపీ సర్కారు తీసుకొచ్చిన 'ఫ్రీ హోల్డ్' చట్టం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రభుత్వ భూములను అప్పనంగా దోచుకునేందుకు దోహదపడింది. పెత్తందారుల చేతుల్లో ఉన్న ఆక్రమిత భూములకు చట్టబద్ధత కల్పించేందుకు ఉపయోగపడింది. వైసీపీ నేతలు రూ.కోట్లకు పడగెత్తేలా చేసింది. అధికారులను దారికితెచ్చుకుని భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుని.. ఆపై అమ్మి సొమ్ము చేసుకోవడానికి దారులు కల్పించింది. జిల్లావ్యాప్తంగా 1.36 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించినట్లు, వీటిలో 4వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. అందులో అత్యధికం కనిగిరి, మార్కాపురం డివిజన్లలోనే ఉన్నాయంటే ఇక్కడ అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో తేటతెల్లమవుతోంది.

- అందులో లక్షా 36వేల ఎకరాలు అసైన్డ్ భూమి
- 4వేల ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తింపు
- వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే అక్రమం
- కనిగిరి, మార్కాపురం డివిజన్లలోనే అధికం
- అధికారుల విచారణలో వెలుగులోకి అవకతవకలు

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 9 : ఏళ్ల తరబడి అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములను అమ్ముకునేందుకు అవకాశం కల్పించినదే ఫ్రీ హోల్డ్ చట్టం. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం అక్రమార్కులకు వరంగా మారడంతోపాటు అధికారులకు కాసుల వర్షం కురిపించింది. వైసీపీ ప్రభుత్వం గతేడాది అసైన్డ్, చుక్కలు, ఇనాం భూములకు స్వేచ్ఛ కల్పిస్తున్నామని ప్రచారం చేసి గ్రామగ్రామానా సభలు పెట్టి రైతులకు హక్కులు ఇస్తున్నామని పైకి ఊదరగొట్టి లోలోపల వైసీపీ దళారులు బాగుపడటానికి అవకాశం కల్పించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఫ్రీ హోల్డ్ భూములపై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల భూ రికార్డుల పరిశీలన ప్రారంభించింది. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు జిల్లావ్యాప్తంగా లక్షా 82వేల ఎకరాలకు జగన్ సర్కారు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించినట్లు తేలింది. అందులో లక్షా 36 వేల ఎకరాలు అసైన్డ్‌భూములు, 37వేల ఎకరాల చుక్కల భూములు, 9వేల ఎకరాలు ఇనాం భూములు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 4వేల ఎకరాల అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఇప్పటి వరకూ అధికారులు చేసిన విచారణలో తేలింది. విచారణ పూర్తయితే ఎన్నివేల ఎకరాలు ఫ్రీ హోల్డ్ అయ్యాయో వెలుగులోకి వచ్చే అవకాశముంది.



మర్రిపూడి మండలంలో ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

మార్కాపురం, కనిగిరి డివిజన్లలో ఇలా..

- జిల్లాలోని మార్కాపురం, కనిగిరి డివిజన్లలోనే అత్యధికంగా అసైన్డ్‌భూములను ఫ్రీ హోల్డ్‌లో పెట్టారు.
- కనిగిరి డివిజన్‌లో 1,95,938 ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా అందులో 84,611 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో ఉంచారు.
- మార్కాపురం డివిజన్‌లో 1,19,228 ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా అందులో 48,523 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు.
- ఒంగోలు డివిజన్‌లో 29,571 ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా 3,286 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో పెట్టారు. సింగరాయకొండలో 3.91 ఎకరాలు, మద్దిపాడు 5.70 ఎకరాలు, టంగుటూరు 58 ఎకరాలు, సంతనూతలపాడు 52.53 ఎకరాలు, తాళ్లూరు 72 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో పెట్టగా జిల్లాలోని మిగిలిన మండలాల్లో వంద నుంచి వేల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు.

వైసీపీ నేతలకు అనుకూలంగా..

గత ప్రభుత్వ నిర్ణయం వైసీపీ నేతలకు వరంగా మారింది. వేల కోట్ల విలువచేసే భూములను కొల్లగొట్టడానికి ఉపయోగపడింది. చాలా మంది వైసీపీ నేతలు విలువైన భూములను తమ కుటుంబ సభ్యులు, అనుచరుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మార్కాపురం, కనిగిరి డివిజన్లలో ఈ భూముల వ్యవహారం మరింత ఎక్కువగా ఉంది. డివిజన్ కేంద్రమైన కనిగిరితోపాటు ఆ నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అప్పటి ముఖ్య ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఈ ప్రక్రియ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.

మండలాల వారీగా ఫ్రీ హోల్డ్‌లో ఉన్న అసైన్డ్ భూములు

మండలం	ఎకరాలు
సీఎస్‌పురం	8,505
దర్శి	2,302
దొనకొండ	125
హనుమంతునిపాడు	8,456
కనిగిరి	11,931
కేకేమిట్ల	12,750
కురిచేడు	689
మర్రిపూడి	6,591
పీసీపల్లి	9,773
పామూరు	4,945
పొదిలి	9,723
పొన్నలూరు	1,761
వెలిగండ్ల	7,055
ఆర్థవీడు	272
బేస్తవారిపేట	4,344
కంభం	1,043
దోర్నాల	4,054
గిద్దలూరు	4,374
కొమరోలు	1,168
మార్కాపురం	3,501
పెద్దారవీడు	4,940
పుల్లలచెరువు	10,464
రాచర్ల	1,984
తర్లుబాడు	5,227
త్రిపురాంతకం	4,502
వైపాలెం	2,646
చీమకుర్తి	138
కొండపి	298
కొత్తపట్నం	651
ముండ్లమూరు	291
నాగులుప్పలపాడు	1,114
ఒంగోలు	402
జరుగుమల్లి	197



వెంపరాల మేజర్‌లో పూడిక, చిల్లచెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

మేజర్ కాలువల్లో పూడిక, చిల్లచెట్ల తొలగింపు

- మంత్రి గొట్టిపాటి చొరవతో యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

అద్దంకి, అక్టోబరు 9 : సాగర్ కాలువలలో పూడిక పేరుకు పోవడం, చిల్ల చెట్లు దట్టంగా పెరగడంతో నీటి ప్రవాహం ముందుకు కదలక పొలాలకు నీరు సరిగా చేరడం లేదు. దీంతో పలు గ్రామాల రైతులు ఇటీవల అద్దంకి బ్రాంచి కాలువపై మంత్రి రవికుమార్ పర్యటించే సమయంలో వివరించారు. దీంతో వెంటనే స్పందించిన రవికుమార్ అద్దంకి నియోజకవర్గ పరిధిలోని అన్ని మేజర్ కాలువలలో వెంటనే పూడికతీత పనులు, చిల్లచెట్ల తొలగింపు చేపట్టాలని ఎన్నెస్పీ అధికారులను ఆదేశించారు. అన్ని మేజర్ కాలువలను పరిశీలించి, ఏయే ప్రాంతంలో పూడికతీత, చిల్లచెట్లు తొలగింపు చేపట్టాలో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలంటే ఆలస్యం అయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా రైతుల పంటల సాగుకు ఇబ్బంది లేకుండా ఉండేలా వెంటనే పూడిక తీత పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు ఉన్నతాధికారులతో కూడా ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే ఎక్స్‌కవేటర్ యజమానులతో మాట్లాడి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం వెంపరాల, పసుమర్రు మేజర్‌లలో రెండేసి ఎక్స్‌కవేటర్లతో పూడికతీత పనులు పనులు మొదలుపెట్టారు. రెండు, మూడు రోజులలో రెండు మేజర్‌లలో ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ తరువాత మరో రెండు మేజర్‌లలో పనులు ప్రారంభించనున్నారు. మంత్రి గొట్టిపాటి వెంటనే స్పందించి నిధుల కోసం ఎదురు చూడకుండా యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించడంతో నీటి విడుదలకు అడ్డంకులు తొలగనున్నాయి. పూడికతీత పనులు చేపట్టడంపట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక

- అక్రమంగా తరలిస్తే చర్యలు
- జిల్లాలో స్టాక్ పాయింట్లు లేవు
- స్థానిక అవసరాల కోసం ఎక్కడికక్కడ వెసులుబాటు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 9 : జిల్లాలో ప్రజలకు ఉచిత ఇసుకను పారదర్శకంగా అందిస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది జూలై 8 నుంచి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. అప్పటి నుంచి జిల్లాలో 62,291 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా ప్రజలకు అందించామన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేవని స్పష్టం చేశారు. అవసరమైన ఇసుకను నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల్లోని స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా చేస్తున్నామని చెప్పారు.

ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్

జిల్లాలో స్థానిక అవసరాల కోసం 285 వాగులు, వంకలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. వాటి నుంచి సమీపంలోని గ్రామాల ప్రజలు సొంత అవసరాల కోసం ఉచితంగా తోలుకోవచ్చని తెలిపారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు యజమానులు దరఖాస్తు చేసుకుంటే జిల్లాస్థాయి ఇసుక కమిటీ పరిశీలించి అనుమతులు ఇస్తుందన్నారు. ఈనెల నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు జిల్లాలో 4.36 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరమవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదుల కోసం 62817 99518 నంబర్‌తో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు

జిల్లాలో మద్యం షాపుల కోసం ఈనెల 1నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని కలెక్టర్ అన్సారియా చెప్పారు. దరఖాస్తు గడువును ప్రభుత్వం మరో రెండు రోజులు పెంచిందన్నారు. జిల్లాలో 171 మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 16నుంచి కొత్త దుకాణాలు ప్రారంభించు కోవచ్చని చెప్పారు. గీత కార్మికులకు 17 షాపులు కేటాయించడం జరిగిందని, వాటికి ప్రత్యేకంగా మార్గదర్శకాలు రావాల్సి ఉందని వెల్లడించారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా : ఎస్పీ దామోదర్

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. మూడు నెలల్లో 70 కేసులను నమోదు చేశామన్నారు. ఉచిత ఇసుక విధానం పటిష్టంగా అమలయ్యేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మరోసారి దొరికితే యజమానులపై పీడీ యాక్టు కింద చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక

మార్టూరు, అక్టోబరు 9 : మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో 1987-88లో 10 వతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం హైస్కూల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు హనుమంతరావు, జగన్మోహనరావు, సుబ్బమ్మ, దివంగత వెంకయ్య మాస్టారి సతీమణి నరసమ్మను వారు ఘనంగా పూలమాలలతో సత్కరించారు. ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకున్న వారు కష్టసుఖాలపై మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సర్పంచ్ సతీష్‌కుమార్, పూర్వ విద్యార్థులు దాసరి శ్రీనివాసరావు, వెంకట్రావు, మల్లికార్జున, సాంబశివరావు, హరిబాబు, ప్రభాకర్, సురేష్, మురళి, భూలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

బల్లికురవ, అక్టోబరు 9 : సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు చీరాల ఆర్డీవో అఖిల అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 10 అర్జీలు అందాయి. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. అర్జీదారులను తిప్పుకోకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ రవిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో :09ఐఎన్‌కె01 అన్నదానం చేస్తున్న నాయకులు

వెయ్యి మందికి డొక్కా సీతమ్మ అన్నదానం

ఇంకొల్లు, అక్టోబరు 9 : అంకమ్మకాలనీ 7వ వార్డులో బుధవారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఆర్ఐ మన్నం శ్రీకాంత్ ఆధ్వర్యంలో సుమారు 1000 మందికి అన్నదానం చేసారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ ఇంతియాజ్, ఇంకొల్లు మండల అధ్యక్షుడు నారిశెట్టి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు ఆర్‌కె రెడ్డి, మండల కార్యదర్శి మహేష్, కొండపల్లి వెంకటేశ్వర్లు, ముస్తాఫా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పంచాయితీపై ఫైర్

గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగుల బది'లీలల'పై పీఆర్ డైరెక్టర్ సీరియస్

- డీపీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్
- పూర్వ అధికారి ఉషారాణిపై విచారణకు ఆదేశం
- కలెక్టర్‌కు నివేదిక సమర్పించిన ఎస్డీసీ లోకేశ్వరరావు



విచారణకు హాజరైన పూర్వపు డీపీవో, సిబ్బంది (ఫైల్)

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 9 : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రేడ్-5, గ్రేడ్-6 (సచివాలయ కార్యదర్శులు) ఉద్యోగుల బదిలీల్లో తిరకాసుపై పీఆర్ డైరెక్టర్ రవితేజ సీరియస్ అయ్యారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో డీపీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కిషోర్‌బాబును కలెక్టర్ అన్సారియా సస్పెండ్ చేశారు. పూర్వపు డీపీవో ఉషారాణిపై విచారణకు ఆదేశించారు. గ్రేడ్-5. గ్రేడ్-6 ఉద్యోగుల బదిలీల విషయంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. పెద్దఎత్తున చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన ఎస్డీసీ లోకేశ్వరరావు బుధవారం సాయంత్రం నివేదికను సమర్పించారు. అయితే ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంలో జాప్యం వెనుక వసూళ్ల మర్మం ఉందన్న ఫిర్యాదులు పంచాయతీరాజ్ డైరెక్టర్‌కు వెళ్లాయి. దీనిపై ఆయన సీరియస్ అయ్యారు. తక్షణ చర్యలకు ఆదేశించారు. దీంతో కలెక్టర్‌కు విచారణాధికారి నివేదిక సమర్పించడానికి ముందుగానే జూనియర్ అసిస్టెంట్‌పై వేటు పడింది. డైరెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు అందుకు సంబంధించిన ఫైల్‌ను బుధవారం కలెక్టర్‌కు పంపగా ఆమె ఆమోదముద్ర వేశారు. పూర్వపు డీపీవో ఉషారాణిపై విచారణకు ఆదేశించారు. ముందు మరికొంత మందిపై వేటు పడే అవకాశం ఉంది. విచారణలో

అవాక్కయ్యే నిజాలు బహిర్గతం

బదిలీల్లో అక్రమాలపై విచారణాధికారిగా నియమితులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు రెండ్రోజుల క్రితం పూర్వ జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి. అప్పటి ఏవో శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్‌లు కిషోర్, సాయిలను విచారించారు. వారి వద్ద నుంచి లిఖిత పూర్వకంగా సమాచారం తీసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులతో లోకేశ్వరరావు మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా విస్తుపోయే నిజాలను కార్యదర్శులు చెప్పినట్లు సమాచారం. ఎవరెవరికి ఎంత ఇచ్చింది పూసగుచ్చినట్లు వివరించినట్లు తెలిసింది. ప్రధానంగా ముగ్గురు పేర్లను వారు వెల్లడించినట్లు తెలిసింది. దీంతో వారి ఫోన్‌పే ఐడీల ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు జమైన నగదు వివరాలను విచారణాధికారి సేకరించినట్లు సమాచారం. ఆ మొత్తం వివరాలను ఆయన తన నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. కౌన్సెలింగ్ నిర్వహించి నెల దాటినా సకాలంలో ఆర్డర్లు ఇవ్వకపోవడం వెనుక మర్మాన్ని కూడా ఆయన అందులో పొందుపర్చినట్లు తెలుస్తోంది.



చికిత్స పొందుతున్న జ్వర బాధితులు



మందుల కోసం జ్వర పీడితులు

మంచంపట్టిన నాంచారపురం

- గొంతు, కీళ్ల నొప్పులు
- ఎంతకీ తగ్గక నరసరావుపేట, గుంటూరుకు పయనం

కురిచేడు, అక్టోబరు 9 : జ్వరపీడితులతో నాంచార పురం విలవిల్లాడుతోంది. వారం రోజుల నుంచి గ్రామంలో జ్వరాలు పెరుగుతున్నాయి. ఆర్ఎంపీల వద్ద పరీక్షలు చేయించి మందు వాడినా ఫలితం లేక ఎక్కువ శాతం మంది బాధితులు నరసరావుపేట, గుంటూరుకు పరుగు పెడుతున్నారు. జ్వరంతో పాటుగా కడుపులో మంట, కీళ్ల నొప్పులు వారిని బాధ పెడుతున్నాయి. పేదవారు మాత్రం కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. ఒక్క బుధవారం రోజునే కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చాలా మంది జ్వర పీడితులు వచ్చారు. వారిని పరీక్షించిన వైద్యులు వైరల్ ఫీవర్‌గా గుర్తించారు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తోందని అన్నారు. రెండు రోజుల్లో నాంచార పురంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. గ్రామంలో మురికి నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగిపోయాయి.

నాలుగు రోజులుగా జ్వరం



కడుపులో మంట, కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉన్నాయి. ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు. నాలుగు రోజులుగా రాత్రి సమయాల్లో నొప్పులు ఎక్కువగా ఉంటున్నాయి. ఏమి తినలేని పరిస్థితి ఉంది. గ్రామంలో ఎక్కువ మందిది ఇదే పరిస్థితి. మా ఇంట్లో అందరూ జ్వరపీడితులే.

- గాదె శ్రీను, నాంచారపురం

మరో రెండు రోజులు

- మద్యం షాపులకు దరఖాస్తు గడువు పెంపు
- రేపటి వరకూ అవకాశం
- 14న లాటరీ ద్వారా కేటాయింపు

ఒంగోలు (క్రైం), అక్టోబరు 9 : మద్యం దుకాణాల కోసం దరఖాస్తు గడువును ప్రభుత్వం మరో రెండు రోజులు పెంచింది. శుక్రవారం వరకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. జిల్లాలో 171 మద్యం దుకాణాలకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. తొలుత ప్రకటించిన ప్రకారం బుధవారంతో దరఖాస్తుల దాఖలుకు గడువు ముగియాల్సి ఉంది. కానీ దరఖాస్తుదారుల విజ్ఞప్తి మేరకు ఈనెల 11 వరకూ గడువు పొడిగించింది. బుధవారం రాత్రి వరకూ 2,168 దరఖాస్తులు అందాయి. ఈనెల 14న లాటరీ విధానంలో షాపులు కేటాయించనున్నారు. 16 నుంచి అవి తెరుచుకోనున్నాయి. ఇప్పటి వరకూ మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజు ద్వారా 43.36 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూరింది. ప్రస్తుతం సరాసరి మద్యం దుకాణానికి 12 దరఖాస్తులకు పైగా వచ్చాయి. మరో రెండు రోజులు అవకాశం ఇవ్వడంతో వీటి సంఖ్య మరింత పెరుగుతుందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

త్వరలోనే మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

ఎమ్మెల్యే దామచర్ల



నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), అక్టోబరు 9: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే అభివృద్ధివైపు అడుగుల వేయడంతో పాటు, హామీలు అమలు చేసి చూపిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఒంగోలులో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఇంద్ర, స్టార్‌లైన్ బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రైవేటు బస్సులకు దీటుగా ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆధునిక హంగులు, నూతన బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలోనే ఒంగోలు డిపోకి 105 కొత్త బస్సు లను తీసుకురావడం జరిగిందన్నారు. రోడ్డు భద్రత విషయంలో ఆర్టీసీ ప్రయాణ సురక్షితమని, ఆర్టీసీకి ఆదాయం వచ్చినా ప్రభుత్వానికి వచ్చినట్లే అని ఆ యన చెప్పారు. ఒంగోలు డిపోలో మొత్తంగా 22 ఏసీ బస్సులను తెచ్చినట్లు వివరించారు. ప్రజలు ఆర్టీసీలో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు

మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్



సంచులు ప్రదర్శిస్తున్న కమిషనర్ రషీద్

చీరాలటౌన్, అక్టోబరు 9 : ప్లాస్టిక్ వినియోగంపై నిబంధనలు పాటించాలని భిన్నంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ హెచ్చరించారు. ఇప్పటికే దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఉన్నత అధికారుల నుంచి అందినట్లు తెలిపారు. నేతాజీ సేవా సమితి వారు అందించిన జూట్ బ్యాగులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కృష్ణమూర్తి, పవని భానుచంద్ర మూర్తి, సంఘ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.